నమస్తే తెలంగాణ
# జనగామ
5 | శుక్రవారం 14 జూన్ 2024 | JANAGAON


హనుమకొండలోని రెడ్డికాలనీలో కురుస్తున్న వర్షం

# జోరు వాన

- ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి భారీగా..
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, దెబ్బతిన్న ఇండ్లు..
- ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- పిడుగుపడి ఇద్దరికి గాయాలు
- నర్సంపేటలో కాలనీల్లోకి వరద


జనగామ పట్టణంలో పడుతున్న వాన



ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షం పడింది. వరంగల్ నగరంతోపాటు నర్సంపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామ శివారులో తాడిచెట్టుపై పిడుగు పడింది. జనగామ, మహబూబా బాద్‌లో ఓ మోస్తరు వాన పడింది. సీరోలు మండలంలోని మన్నెగూడెం, అందనాల పాడు, చిలుక్కోయలపాడు గ్రామాల్లో జోరు వాన కురిసింది. శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం సమీపంలో పరకాల జాతీయ రహదారిపై చెట్టు విరిగిపడింది. కమలాపూర్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఇండ్లపై కప్పులు లేచిపోయి గోడలు కూలిపోయాయి. చెట్టు కూలడంతో ఇల్లు ధ్వంసమైంది. వర్ధన్నపేట మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామ సమీపంలో పిడుగు పడి మాగి వంశీ(23), బంగారి హనుమాన్(16)కు గాయాలయ్యాయి. హనుమాన్‌కు అపస్మారక స్థితికి చేరుకోగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి, వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించి వైద్యపరీక్షలు చేయిస్తున్నారు.

*- నమస్తే నెట్‌వర్క్, జూన్ 13*


నర్సంపేటలో కాలనీలోకి చేరిన వరద నీరు


హనుమకొండ కేయూ రోడ్‌లో ..

## నేడు ఐసెట్ ఫలితాలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 13 : టీజీ ఐసెట్–2024 ఫలితాలను శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, టీజీసీహెచ్ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ప్రొఫెసర్లు ఎస్‌కే మహమూద్, శ్రీరామ్ వెంకటేశ్, ఐసెట్ కన్వీనర్ నరసింహాచారి హైదరాబాద్‌లో విడుదల చేయనున్నారు. https://icet.tsche.ac.inలో ఫలితాలు చూసుకోవచ్చున్నారు.

## కోట్లతో వ్యాపారి ఉడాయింపు..?

బయ్యారం, జూన్ 13 : కోట్లలో అప్పులు చేసిన ఓ వ్యాపారి ఉడాయించినట్లు మండలంలో ప్రచారం జరుగుతున్నది. మండలకేంద్రంలోని గాంధీసెంటర్‌కు చెందిన కిరాణా వ్యాపారి తన సన్నిహితులు, స్నేహితుల నుంచి రూ. ఐదు కోట్ల అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఐదు రోజుల క్రితం దైవ దర్శనానికి వెళ్తున్నానని చెప్పి కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. రోజులు గడుస్తున్నా ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో అప్పు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. అప్పులు ఇచ్చిన కొందరు పోలీసులను ఆశ్రయించగా లీగల్‌గా వెళ్లాలని సూచించినట్లు సమాచారం.

### సబ్సిడీ అందుతలేదు..



విద్యుత్ సబ్సిడీ ఎందుకొస్తలేదని అధికారులను అడిగితే ఎన్నికల కోడ్ వచ్చిందని, తరువాత చూద్దామని పంపించిండ్రు. ఈనెల 10న ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్లిన. దీంతో ఆన్‌లైన్‌లో యూఎస్‌సీ నంబర్ 0974567కు బదులుగా 10974576 అని తప్పుగా వేశారని చెప్పిండ్రు. మీరే కదా వేసిందని అడిగితే ఒకసారి ఆన్‌లైన్ చేశాక సరిచేయడానికి వీలు కాదన్నరు. ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇస్తే సరి చేస్తమన్నరు. అదేవిధంగా నా భర్త ఉప్పలయ్య పేరు మీద హెచ్‌పీ కంపెనీలో గ్యాస్(609434) బుక్ చేసి తీసుకున్నం. నెల రోజుల తర్వాత బ్యాంకుకు వెళ్లినా సబ్సిడీ రాలేదంటున్నరు.

– రచ్చ ఎల్లమ్మ, కూలీ, కురవి

### రెండు సిలిండర్లకు డబ్బులు పడలె..



హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో 654191 నంబర్ మీద ఆరు నెలల్లో రెండు సార్లు బుక్ చేసి గ్యాస్ మొద్దు తీసుకున్న. సబ్సిడీ డబ్బులు పడ్డయా అని బ్యాంకు అధికారులను అడిగితే రాలేదంటున్నరు. ఎందుకు పడత లేవని మహబూబాబాద్‌లోని గ్యాస్ కంపెనీకి వెళ్లిన. రెండు సిలిండర్లకు సంబంధించిన సబ్సిడీ డబ్బులు రాలేదన్నరు. అధికారుల కాడికి పొమ్మన్నరు.

– మేకల నరేశ్, పర్వతగిరి, మహబూబాబాద్


ఖానాపురం మండల పరిషత్ కార్యాలయంలో బారులు తీరిన గృహజ్యోతి లబ్ధిదారులు



# లబ్ధిదారులకు షాక్

**అధికారుల తప్పిదంతో అందని 'గృహజ్యోతి'**

- ఆన్‌లైన్‌లో తప్పగా నమోదు చేస్తే ఎడిట్ ఆప్షన్ లేదట..
- గ్యాస్ సబ్సిడీ కోసమూ ఎదురుచూపులే
- బ్యాంకులు, గ్యాస్ కంపెనీల చుట్టూ చక్కర్లు


మహబూబాబాద్, జూన్ 13(నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకం ద్వారా విద్యుత్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిందని, తర్వాత చూద్దామని ఓ సారి, ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారని, ప్రభుత్వం ఇంకా ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదని ఇప్పుడు చెబుతున్నారు. సర్కారు ఎప్పుడు ఆప్షన్ ఇస్తుందో.. తమకు ఎప్పుడు సబ్సిడీ వస్తుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా గ్యాస్ సబ్సిడీ కోసం అర్హులు బ్యాంకులు, గ్యాస్ కంపెనీల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రెండు మూడు సార్లు బుక్ చేసుకుని గ్యాస్ రీఫిల్ తీసుకున్నా సబ్సిడీ పడకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలకు మోక్షం లేదని, అధికారుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేకుండా పోతోందని పెదవి విరుస్తున్నారు.

## గృహజ్యోతి కోసం పడిగాపులు

**మొరాయించిన ఆన్‌లైన్ సర్వర్..**


వాజేడు : ఎంపీడీవో కార్యాలయం వద్ద దరఖాస్తుల సవరణ కోసం వచ్చిన లబ్ధిదారులు

ఖానాపురం/వాజేడు, జూన్ 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం అమలుకు నోచుకోక అర్హులైన లబ్ధిదారులకు కష్టాలు తప్పడంలేదు. తెల్లరేషన్ కార్డుదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది సర్వే చేసి అర్హులను గుర్తించి ఉచిత బిల్లులు అందజేశారు. అయితే చాలా మంది దరఖాస్తుల్లో తప్పులుండడంతో వాటిని సరిదిద్దేందుకు ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం కోడ్ ఎత్తివేయడంతో అర్హులైన లబ్ధిదారులు తప్పొప్పులను సవరించుకునేందుకు ఎంపీడీవో కార్యాలయాలకు తరలివస్తున్నారు. గురువారం ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి సర్వర్ మొరాయించడంతో వరంగల్ జిల్లా ఖానాపురం, ములుగు జిల్లా వాజేడు ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి క్యూలో నిల్చొని పడిగాపులు కాశారు. అధికారుల తప్పిదంతోనే తాము రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు.


Cat: I(A) Domestic PH: 1
Contracted Load: 1.88KW
Meter No: 02144119(IR) MF: 1.00
STR Code: 094942719007
Pole No:11/4/9/10 PF:1

| | Date | Sts | Reading |
|---|---|---|---|
| Present KWH | 04/06/24 | 01 | 4796 |
| Previous KWH | 04/05/24 | 01 | 4701 |
| KWH Units: 95 | | Days: | 31 |
| Average Month Units | | | 95.0 |
| Recorded MD | | | 0.82 KW |
| Energy Charges | | | 237.00 |
| Fixed Charges | | | 20.00 |
| Customer Charges | | | 70.00 |
| Electricity Duty | | | 5.70 |
| Interest On ED | | | 0.02 |
| Surcharge | | | 10.00 |
| ACD Surcharge | | | 0.00 |
| FSA/FCA Charges | | | 0.00 |
| Adjustments | | | 0.00 |
| Interest on CD | | | 0.00 |
| Loss/Gain | | | 0.28 |
| Bill Amount: | | | 343.00 |
| Arrears : | | | |
| As on 31-03-2024: | | | 0.00 |
| After 01-04-2024: | | | -1.00 |
| Total Due : | | | 342.00 |

ఈ నెల వచ్చిన కరెంటు బిల్లు

# వానొస్తే రాకపోకలెట్ల?

**గతేడాది వరదలకు కూలిన దొడ్ల బ్రిడ్జి**

- కొండాయి, మల్యాలకు నిలిచిన రవాణా
- ప్రస్తుతం డైవర్షన్ రోడ్డే దిక్కు
- భారీ వర్షం కురిస్తే కొట్టుకుపోయే ప్రమాదం
- భయాందోళనలో రెండు గ్రామాల ప్రజలు


కూలిన బ్రిడ్జి పక్కనే మేడారం జాతర సమయంలో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు

ఏటూరునాగారం, జూన్ 13 : వానొస్తుందంటేనే ఆ రెండు గ్రామాల్లో ప్రజల్లో భయం మొదలవుతుంది. వరద భారీగా వస్తే రాకపోకలు నిలిచిపోవడమే గాక గతేడాది లాగే వరద గ్రామాన్ని ముంచెత్తితే తమ పరిస్థితి ఏంటనే ఆందోళన వెంటాడుతున్నది. వివరాలిలా ఉన్నాయి. జంపన్నవాగుపై ఏటూరు నాగారం మండలం దొడ్ల సమీపంలో నిర్మించిన బ్రిడ్జి గతేడాది భారీ వరదలకు కొట్టుకుపోయింది. దీంతో కొండాయి గ్రామం పూర్తిగా మునిగిపోవడంతో మల్యాల–కొండాయికు రవాణా స్తంభించింది. మేడారం జాతర సందర్భంగా ప్రైవేట్ వాహనాలను చిన్నబోయినపల్లి నుంచి ఊరట్టం వరకు మళ్లించేందుకు వాగుపై తాత్కాలికంగా రూ. 20 లక్షలతో డైవర్షన్ రోడ్డు వేయగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా, ఇటీవలి వర్షానికి మళ్లీ వాగులోకి వచ్చిన వరదతో రోడ్డు చివర్లు కోతకు గురయ్యాయి. నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకుపోతుండగా, రోడ్డుపై ఒకచోట చిన్నపాటి గొయ్యి ఏర్పడింది. ఇక భారీగా వరదొస్తే డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అలాగే కొండాయి మునిగిపోతుందని, రవాణా సౌకర్యం నిలిచిపోతుందనే భయం గ్రామస్తుల్లో నెలకొంది. గతేడాది నిత్యావసర సరుకులు, కూరగాయల కోసం పడిన కష్టాలను గుర్తుచేసుకుంటున్నారు. అయితే ముంపు ప్రాంతాల్లోకి ముందస్తుగానే అధికారులు రేషన్, నిత్యావసర సరుకులను నిల్వ చేస్తుంటారు. కానీ ఇప్పటివరకు అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పాటు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**పుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రతిపాదనలు**

కూలిన వంతెన మధ్య నుంచి తాత్కాలిక పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వీరభద్రం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ వానకాలం ఉపయోగపడేలా 84 అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పుతో పూర్తిగా ఐరన్‌తో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. నడిచి వెళ్లడంతో పాటు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పుట్ ఓవర్ బ్రిడ్జికి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని ఈఈ చెప్పారు.

# అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- కష్టంగా ఉంటే బదిలీ చేసుకోవాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- వరద సంసిద్ధత సమీక్షలో మంత్రి సీతక్క


వెంకటాపూర్ : రామప్ప చెరువు తూమును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

ములుగు, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పనిచేసే అధికారులు బాధ్యతగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. గత కొద్ది రోజులుగా అధికారులు అవలంబిస్తున్న విధానాలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేయడం కష్టంగా అనిపిస్తే బదిలీ చేసుకొని వెళ్లాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహించిన వరద సంసిద్ధత సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ వానకాలంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముంపు ప్రాంతాల నివారణకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల్లో మంచినీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అలాంటి కాంట్రాక్టర్లను అధికారులు తొలగించాలని ఆదేశించారు. వరదల సమయంలో ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గతేడాది వరదల వల్ల ఏర్పడిన పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులను సహించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఏటూరునాగారం ఏఎస్పీ మహేశ్ గీతే, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఐబీ ఎస్ఈ విజయ్‌భాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఎన్‌పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లై డీఎం రాంపతి, ఇరిగేషన్ అధికారి అప్పల్‌నాయుడు, డీఏవో విజయ్‌చంద్ర, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్, డీసీవో సర్దార్‌సింగ్, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీపీఆర్వో రఫీక్, ఏపీఆర్వో వేణు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇంటర్‌ప్రిటేషన్ పనులు పూర్తి చేయాలి


వెంకటాపూర్ : ఇంటర్‌ప్రిటేషన్ పనులు అక్టోబర్ లోపు పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం పాలంపేటలో కొనసాగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులను, రామప్ప చెరువు కట్టను, తూములను, కాల్వలను, మత్తడి ప్రదేశాన్ని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆలయ తూర్పు రహదారి ఎదురుగా పదెకరాల స్థలంలో రూ. 61.99 కోట్లతో ఫుడ్ కోర్టు, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రామప్ప సరస్సును సందర్శించి నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరస్సు మత్తడిని పరిశీలించి వరదల నియంత్రణ కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రామప్ప చెరువు మత్తడి పడిన సమయంలో మోరంచ వాగు, కాలువల్లో సిల్ట్ తీయక పంట పొలాల్లోకి వరద చేరి తీవ్రంగా నష్టపోతున్నామని పాలంపేట రైతులు మంత్రి సీతక్కకు విన్నవించగా సిల్ట్ తీసేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు.

అలాగే ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు విన్నవించగా త్వరలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్రీజ, మహేందర్ జీ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ విజయభాస్కర్, డీఈ రవీందర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

# చిత్రాలు భళా.. లైబ్రరీలకు కొత్తకళ

**రూ.22 లక్షలతో సుందరీకరణ**

**పిక్టోరియల్ పెయింట్స్‌తో ఆకట్టుకుంటున్న గ్రంథాలయాలు**


రంగశాయిపేట లైబ్రరీ గోడలపై వేసిన మోడల్ పిక్టోరియల్ పెయింటింగ్



పిల్లల బొమ్మలతో రంగశాయిపేట లైబ్రరీ



నెక్కొండ లైబ్రరీ

విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతున్న జిల్లాలోని గ్రంథాలయాలకు మహర్దశ వచ్చింది. కలెక్టర్ పీ ప్రావీణ్య ప్రత్యేక చొరవతో మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధి, మరమ్మతులకు రూ. 22.19 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లాలోని వరంగల్ కేంద్రీయ గ్రంథాలయం, పర్వతగిరి, కరీమాబాద్, రంగశాయిపేట, ఉర్సు, నర్సంపేట, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, గురిజాల గ్రంథాలయాల భవనాలకు మరమ్మతులు, నామ ఫలకాలతోపాటు కళాత్మకంగా గోడలకు వేసిన పెయింటింగ్స్ ఆకట్టుకున్నాయి.

*- వరంగల్, జూన్ 13 (నమస్తే తెలంగాణ)*